## క్లుప్తంగా

### న్యాయవాదుల వెల్ఫేర్ యాక్ట్‌లో నిబంధనలు సరికావు


సత్యనారాయణ

అల్లిపురం: న్యాయవాదుల వెల్ఫేర్ యాక్ట్‌లో కొత్త నిబంధనలు తీసుకురావడం సరికాదని వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ అధికార ప్రతినిధి, సీనియర్ న్యాయవాది పాకా సత్యనారాయణ అభిప్రాయపడ్డారు. పెళ్లి కానివారు, విడిగా ఉంటున్నవారు, పిల్లలు లేని న్యాయవాదు లు తమకు నచ్చినవారిని నామినీగా నియమించుకునే హక్కు ఉండాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రతి న్యాయవాది వెల్ఫేర్ ఫండ్ కోసం డబ్బు చెల్లిస్తున్నందున, నామినీని నియమించుకోవడం అనేది వారి వ్యక్తిగత హక్కు అని ఆయన స్పష్టం చేశారు. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ప్రస్తుతం విధించిన పరిమితులు అన్యాయమని, ఈ రూల్స్‌ను మార్చి న్యాయవాదుల ప్రయోజనాలను కాపాడాలని ఆయన కోరారు. బార్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా వారు న్యాయవాదుల అభ్యున్నతికి తోడ్పడేలా చట్టాలను రూపొందించాలని ఆయన సూచించారు.

### స్వచ్ఛోత్సవ్ పోస్టర్ ఆవిష్కరణ


స్వచ్ఛోత్సవ్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్ తదితరులు

మహారాణిపేట: 'స్వచ్ఛతా హీ సేవా – 2025' కార్యక్రమంలో భాగంగా రూపొందించిన స్వచ్ఛోత్సవ్ పోస్టర్లను కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాలు సెప్టెంబర్ 17న ప్రారంభమై అక్టోబర్ 2 వరకు కొనసాగుతాయని డీపీవో శ్రీనివాసరావు తెలిపారు. వీటిని పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, డీఆర్వో భవానీ శంకర్, జెడ్పీ సీఈవో నారాయణమూర్తి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

### రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్‌పై పోటీలు


కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల

దాబాగార్డెన్స్: విశాఖపట్నం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల అర్ధశతాబ్ది ఉత్సవాల నిర్వహణలో భాగంగా శుక్రవారం రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ అనే అంశంపై జోనల్ స్థాయి డిగ్రీ కళాశాల విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. మంజుల పోటీలను ప్రారంభించి అనంతరం మాట్లాడుతూ ఇలాంటి పోటీలు విద్యార్థుల్లో శాస్త్ర విజ్ఞానం, సాంకేతికతలో ఉన్నత శిఖరాలు అధిరోహించడానికి దోహదపడతాయని అన్నారు. అంతే కాకుండా విద్యార్థుల్లో శాస్త్రీయ విలువలు పెంపొందుతాయని చెప్పారు. పోటీల్లో విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలతో పాటు, యలమంచిలి, ఎస్.కోట, తగరపువలస, చింతపల్లి, మద్రిపాలెం, కృష్ణా కళాశాలల నుంచి విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు. కార్యక్రమంలో కళాశాల రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ కార్యనిర్వహణాధికారి డాక్టర్ పి.ఎల్. శరణ్య, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ నివేదిత, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ అనూష, ఇతర అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

### 'చలో పాడేరు మెడికల్ కాలేజ్'కి తరలిన నేతలు


జిల్లా పరిషత్ జంక్షన్ నుంచి చలో పాడేరుకు బయలుదేరిన నేతలు

దాబాగార్డెన్స్: 'చలో పాడేరు మెడికల్ కాలేజ్' కార్యక్రమానికి 29వ వార్డు నుంచి పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు బయలుదేరి వెళ్లారు. పార్టీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి కనకల ఈశ్వర్, వార్డు అధ్యక్షుడు పీతల వాసు నాయకత్వంలో వీరంతా ప్రయాణమయ్యారు. ఈ కార్యక్రమంలో యూత్ ప్రెసిడెంట్ కొండ్రు సతీష్, జిల్లా యువజన విభాగం కార్యదర్శి తమ్మినేని శ్రీనివాస్, 29వ వార్డు విద్యార్థి విభాగం అధ్యక్షుడు యల్లంకి రామ్ తక్షిత్, గొలగాని మధు, జంగాల వెంకటేష్ పాల్గొన్నారు.


సూపర్‌బజార్ దుకాణ సముదాయాలు

**నాడు..**

ఒకప్పుడు సూపర్‌బజార్ ముందు సరుకుల కోసం ఉదయాన్నే జనం బారులు తీరేవారు. ఇండియన్ నేవీ, ఇతర పెద్ద పెద్ద సంస్థలకు కూడా ఇక్కడి నుంచే కిరాణా సరుకులు సరఫరా చేసేవారు. టెండర్ల కోసం కాంట్రాక్టర్లు పడిగాపులు కాసేవారు. అంగన్‌వాడీలకు బియ్యం, పప్పులు సరఫరా చేయడానికి లక్షలు, కోట్లలో లావాదేవీలు జరిగేవి.

**నేడు..**

అటువంటి వైభవం ఉన్న సూపర్‌బజార్ ప్రస్తుతం రోజుకు కేవలం రూ. వెయ్యి మాత్రమే అమ్ముతుందంటే దాని పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. నిర్వాహణ లోపం, నగరంలో ఇతర పెద్ద సంస్థల రాక దీనికి కారణాలుగా చెప్పవచ్చు. అయితే, నగరంలోని రైతుబజార్లలో ఉన్న కిరాణా దుకాణాలు ఈ సూపర్‌బజార్‌కి సంబంధించినవి కావడంతో అవి ఈ సంస్థకు కొంత ఆర్థిక ఊరటనిస్తున్నాయి. ఈ సంస్థకు ఉన్న స్థలాలు, వైజాగ్ సెంట్రల్ షాపింగ్ మాల్స్, ఇతర వాణిజ్య సముదాయాలు, గోడౌన్‌ల ద్వారా వచ్చే ఆదాయంతో ఇది ప్రస్తుతం నెట్టుకొస్తోంది. ఒకనాడు కళకళలాడిన సూపర్‌బజార్ నేడు కేవలం నిత్యావసరాల దుకాణంగా మిగిలిపోయింది.

## నిన్నటి వైభవం .. నేటి సవాళ్లు

# సూపర్‌బజార్ గాడిలో పడేనా?

**నాడు కళకళ..నేడు వెలవెల**

జగదాంబ: ఒకప్పుడు, డిపార్టుమెంటల్ స్టోర్లు, బిగ్‌బాస్కెట్ వంటి సేవలు లేని రోజుల్లో ఒక కుటుంబానికి అవసరమైన మొత్తం సరుకులు కావాలంటే నగరవాసులకు సూపర్‌బజార్ ఒకే ఒక్క ఎంపిక. విశాఖలోని టర్నర్ చౌల్ట్రీ దగ్గర ఉన్న ఈ సూపర్‌బజార్ కేవలం నిత్యావసర వస్తువులకే పరిమితం కాకుండా, విద్యార్థుల పుస్తకాలు, దీపావళి టపాసులు వంటివి కూడా తక్కువ ధరలకు అందిస్తూ ప్రజల అభిమానాన్ని చూరగొంది.

**తక్కువ ధరలకే సరకులు లభించేవి**



పిల్లల పుస్తకాల దగ్గర నుంచి దీపావళి టపాసుల వరకు, అన్నింటికీ ఒకప్పుడు సూపర్‌బజార్‌నే ఆశ్రయించేవారు. తక్కువ ధరలకు వస్తువులు దొరికే ఈ బజార్‌కు నగరంలో ఎన్ని దుకాణాలు ఉన్నా ముందుగా ఇక్కడికే వచ్చేవారు. కానీ ఆ రోజులు ఇప్పుడు లేవు.

–ఆదినారాయణ, స్థానికుడు

● ఆదాయం కోల్పోయిన సూపర్‌బజార్ ● కేవలం అద్దె రుసుములతో నెట్టుకొస్తున్న వైనం


వినియోగదారులు లేక ఖాళీగా ఉన్న సూపర్ బజార్

**పూర్వ వైభవం తీసుకువస్తాం..**



నగరంలో డిమార్ట్, బిగ్‌బాస్కెట్ వంటి పెద్ద మాల్స్ విస్తరించడంతో సూపర్‌బజార్ అమ్మకాలు తగ్గిపోయాయి. అయితే సూపర్‌బజార్‌కు పూర్వవైభవం తీసుకువస్తాం. రోజుకు లక్ష రూపాయల అమ్మకాల లక్ష్యంతో మార్కెటింగ్‌ను పెంచుతాం. ప్రభుత్వ కార్యాలయాలు, హాస్టళ్లకు అవసరమైన కాంట్రాక్టులు తీసుకుంటాం. అంగన్‌వాడీలకు సరకుల సరఫరా కోసం ఉన్నతాధికారులకు నివేదికలు సమర్పిస్తాం. వినియోగదారులకు తక్కువ ధరలకే నాణ్యమైన సరకులు లభిస్తాయనే నమ్మకాన్ని కల్పిస్తాం.

-పత్రాని శ్రీరాం, సూపర్ బజార్ మేనేజింగ్ డైరెక్టర్

**ఒకప్పుడు క్యూ కట్టేవాళ్లు**



ఒకప్పుడు సరుకుల కోసం సూపర్‌బజార్ ముందు ప్రజలు క్యూ కట్టేవారు. నగరంలో నిత్యావసరాలు కావాలంటే అందరికీ అదే ప్రధాన కేంద్రంగా ఉండేది. అయితే నేడు నగరాభివృద్ధి, కొత్త మాల్స్ రాకతో సూపర్‌బజార్ తన పూర్వ వైభవాన్ని కోల్పోయింది.

-గంగాధర్, స్థానికుడు

### 'సెయింట్ జోసెఫ్'లో 'ఓజోన్- డే'


కళాశాల విద్యార్థులతో అతిథులు, అధ్యాపకులు

కంచరపాలెం: జ్ఞానాపురంలోని సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో బయాలజీ అసోసియేషన్, జువాలజీ విభాగం సంయుక్తంగా ఏకాలజీ కమిషన్‌తో కలిసి శుక్రవారం ప్రపంచ ఓజోన్ దినోత్సవం సందర్భంగా ఒక ప్యానెల్ చర్చను నిర్వహించింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన విజయనగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల జువాలజీ హెడ్ డాక్టర్ పి. రూపావాణి మాట్లాడుతూ ఓజోన్ పొర భూమికి ఒక రక్షణ కవచం లాంటిదని, దానిని కాపాడాల్సిన ఆవశ్యకతను వివరించారు. హానికరమైన అతినీలలోహిత కిరణాల నుంచి రక్షణ పొందడానికి విద్యార్థులు గొడుగులు ఉపయోగించాలని ఆమె సూచించారు. జెనిత్ ఇంపాక్ట్ వర్క్స్ ఫౌండర్ ఎస్. రవికాంత్ రెడ్డి మాట్లాడుతూ బాధ్యతగల పౌరులుగా మనం సుస్థిరమైన జీవనశైలిని పాటించడం ద్వారా భూమిని ఎలా రక్షించుకోవచ్చో విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ మాణిక్యకుమారి, రొసినా జార్జ్, పి. మేరీతో పాటు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### బృందంగా పనిచేస్తే ఎన్ఐఆర్ఎఫ్‌లో మంచి ర్యాంక్

మద్దిలపాలెం : ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని అందరూ సమిష్టిగా బృందంగా పనిచేస్తే భవిష్యత్‌లో మెరుగైన ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంక్ సాధించగలమని ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ అన్నారు. విభాగాధిపతులు, ప్రిన్సిపాళ్లు, డీన్‌లతో శుక్రవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విభాగం నుంచి విశ్వవిద్యాలయం వరకు ఒక ప్రణాళికతో పనిచేయాలని సూచించారు. ప్రస్తుతం ఉన్న దానికంటే మెరుగైన ర్యాంకు సాధించడానికి అవసరమైన చర్యలు చేపట్టాలని విభాగాధిపతులకు సూచించారు.

## డిమాండ్ల సాధనకు రైల్వే కార్మికుల ధర్నా


డీఆర్ఎం కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఈస్ట్ కోస్ట్ రైల్వే శ్రామిక్ యూనియన్ నాయకులు

తాటిచెట్లపాలెం: ఆలిండియా రైల్వేమెన్స్ ఫెడరేషన్(ఏఐఆర్ఎఫ్) జాతీయ స్థాయిలో ఇచ్చిన పిలుపు మేరకు ఈస్ట్ కోస్ట్ రైల్వే శ్రామిక్ యూనియన్, వాల్తేర్ డివిజన్ కో ఆర్డినేటర్ పి.రామమోహనరావు ఆధ్వర్యంలో శుక్రవారం దొండపర్తి డీఆర్ఎం కార్యాలయం వద్ద భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రామమోహనరావు మాట్లాడుతూ 8వ వేతన సంఘం ఏర్పాటు చేయాలని, రైల్వే కార్మికులపై పని ఒత్తిడి తగ్గించాలని, ప్రైవేటైజేషన్, ఔట్‌సోర్సింగ్ విధానాలకు వ్యతిరేకంగాను, అన్ని విభాగాల్లోని ఖాళీలను తక్షణం భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. రైల్వే భద్రతకు కీలకంగా నిలిచిన ఇంజినీరింగ్ ట్రాక్‌మెన్‌ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, రన్నింగ్ స్టాఫ్‌కు మినిమం గ్యారంటీడ్ కిలోమీటర్ అమలు చేయాలని కోరారు. ఎల్‌డీసీ, జీడీసీ ద్వారా సకాలంలో పోస్టులు భర్తీ చేయాలని, వాటిలో ఇంజినీరింగ్ కార్మికులకు అవకాశం కల్పించాలన్నారు. తమ డిమాండ్ల సాధన కోసం డివిజనల్ రైల్వే మేనేజర్ ద్వారా రైల్వే బోర్డు చైర్మన్‌కు మెమోరాండం సమర్పిస్తున్నట్లు రామమోహనరావు తెలిపారు. ధర్నా అనంతరం యూనియన్ నాయకులు డీఆర్ఎం లలిత్ బోహ్రాకు మెమోరాండం సమర్పించారు. ధర్నాలో జోనల్ అధ్యక్షుడు ఆర్.వి.ఎస్.ఎస్.రావు, కేంద్ర నాయకులు, బ్రాంచ్ కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు, రైల్వే కార్మికులు పాల్గొన్నారు.

## సీపీఎం నేత మూర్తికి పితృ వియోగం


సింహాద్రప్పడు పార్థీవ దేహానికి నివాళులర్పిస్తున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు, నేతలు లోకనాథం, జగ్గునాయుడు

దాబాగార్డెన్స్: సీపీఎం జిల్లా భీమిలి జోన్ కార్యదర్శి, జిల్లా కమిటీ సభ్యుడు ఆర్.ఎస్.ఎన్. మూర్తి తండ్రి సింహాద్రప్పడు (75) శుక్రవారం ఉదయం మృతి చెందారు. పది రోజులుగా కిడ్నీ, లివర్ సంబంధిత వ్యాధులతో కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న ఆయన పరిస్థితి విషమించడంతో కన్నుమూశారు. విశాఖలో ఉన్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, కేంద్ర కమిటీ సభ్యుడు కొత్తపల్లి లోకనాథం, జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడుతో పాటు పలువురు సీపీఎం, సీఐటీయూ నాయకులు కేజీహెచ్‌కు వెళ్లి సింహాద్రప్పడు భౌతికకాయానికి నివాళులర్పించారు. సింహాద్రప్పడు పెద్ద కుమారుడు మూర్తి సీపీఎం, సీఐటీయూలో కీలక బాధ్యతలు నిర్వహిస్తుండగా, కోడలు లక్ష్మి అంగన్‌వాడీ సీఐటీయూ యూనియన్ నాయకురాలిగా ఉన్నారు.

## 'టెడ్' వినియోగంతో తాబేళ్ల సంరక్షణ


మాట్లాడుతున్న మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ లక్ష్మణరావు


టార్టాయిస్ ఎక్స్‌క్లూడర్ డివైస్


మహారాణిపేట: తాబేళ్ల రక్షణకు ప్రతి మరబోటులో తప్పనిసరిగా టెడ్ పరికరాన్ని వాడాలని మత్స్యశాఖ జిల్లా సంయుక్త సంచాలకులు పి. లక్ష్మణరావు సూచించారు. శుక్రవారం ఫిషింగ్ హార్బర్‌లో ఎంపెడా–నెట్‌ఫిష్ ఆధ్వర్యంలో నిర్వహించిన టెడ్ (టార్టాయిస్ ఎక్స్‌క్లూడర్ డివైస్) అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మరబోట్లకు టెడ్ పరికరం అమర్చడం వల్ల వలల్లో చిక్కుకున్న తాబేళ్లు సులభంగా తప్పించుకుంటాయని లక్ష్మణరావు వివరించారు. ఈ పరికరం ధర సుమారు రూ. 28 వేలు ఉంటుందని, దీనిని ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద నూరు శాతం రాయితీపై అందిస్తామని తెలిపారు. అలాగే నూరు శాతం సబ్సిడీపై బోట్లకు సరఫరా చేసిన ట్రాన్స్‌పాండర్స్‌ను కూడా తప్పకుండా వాడాలని చెప్పారు. నెట్‌ఫిష్ కోఆర్డినేటర్ హనుమంతరావు మాట్లాడుతూ, అమెరికాకు సముద్ర రొయ్యలు ఎగుమతి చేయాలంటే టెడ్ వాడకం తప్పనిసరి అని తెలిపారు. టెడ్ వినియోగం వల్ల చేపలు, రొయ్యలు తప్పించుకునే అవకాశం ఉండదని, పైగా ఇంధనం కూడా ఆదా అవుతుందని ఎంపెడా మొహంతీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాల్ఫిన్ బోటు యజమానుల సంఘం అధ్యక్షుడు సీహెచ్. వీర్రాజు, ఇతర నాయకులు సూరాడ సత్తిబాబు, బోటు యజమానులు పాల్గొన్నారు.

### ఘనంగా దుర్గమ్మ రాట మహోత్సవం


రాట మహోత్సవంలో పాల్గొన్న కమిటీ సభ్యులు, మహిళలు

అల్లిపురం: దసరా ఉత్సవాల్లో భాగంగా కొబ్బరితోట వాడబలిజ యువజన సంఘం, శ్రీ విఘ్నేశ్వరా న్యూ ఫ్రెండ్స్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి రాట మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ముందుగా మహిళలు రాటను అలంకరించారు. అర్చకులు పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం జరిగిన కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 22వ తేదీ నుంచి తొమ్మిది రోజుల పాటు ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

### విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు



విశాఖ సిటీ: ఏపీఈపీడీసీఎల్ జోన్–1 పరిధిలో 33/11 కేవీ టీఎస్ఆర్ సబ్ స్టేషన్‌లో 8 ఫీడర్ల నిర్వహణ కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో నాలుగు గంటల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని జోన్–1 ఈఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. ఉదయం 6.30 నుంచి 10.30 వరకు ద్వారకానగర్, సంగం శరత్ థియేటర్ వెనుక, డైమండ్ పార్క్, ఆర్టీసీ కాంప్లెక్స్, మధురానగర్, లలితానగర్, రామకృష్ణానగర్, మండవారిపేట, నెహ్రూబజార్, కొబ్బరితోట, జెండాచెట్టు, అచ్చియ్యమ్మపేట, భూపేష్‌నగర్, అల్లిపురం, నేరెళ్లకోనేరు, కర్ణాలవీధి, అల్లిపురం రైల్వేస్టేషన్ రోడ్డు, అల్లిపురం సిగ్నల్ పాయింట్ ఏరియా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని పేర్కొన్నారు.

### సామూహిక భక్తి గానం నేడు

మద్దిలపాలెం : త్యాగరాజ ఆరాధన ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం కళాభారతి ఆడిటోరియంలో అంతా రామమయం సామూహిక భక్తిగానం నిర్వహిస్తున్నామని ట్రస్ట్ ప్రతినిధి డాక్టర్ గుమ్ములూరి రాంబాబు తెలిపారు. ఆకొండి వెంకటరావు నిర్వహణలో 70 మందికిపైగా కళాకారులు భక్తితో శ్రీరామ నామ కీర్తన చేయనున్నారని పేర్కొన్నారు. శ్రీరామ నామామృత గానాన్ని ఆలకించి పులకించేందుకు అందరూ ఆహ్వానితులేనని ఆయన తెలిపారు.

## శరన్నవరాత్రులకు సర్వం సిద్ధం

● వైభవంగా నిర్వహించేందుకు సన్నాహాలు
● సర్వాంగ సుందరంగా ఆలయాలు



సంతాన లక్ష్మి అవతారంలో కనకమహాలక్ష్మి అమ్మవారు (ఫైల్)

దాబాగార్డెన్స్: నగరంలోని దక్షిణ నియోజకవర్గ పరిధిలో ఉన్న పలు ఆలయాల్లో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఈ నెల 22 నుంచి అక్టోబరు 2 వరకు అత్యంత వైభవంగా జరగనున్నాయి. ఈ ఉత్సవాల కోసం ఆలయాలన్నీ ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నాయి.

**శ్రీ కనకమహాలక్ష్మి దేవస్థానం**

బురుజుపేటలోని శ్రీ కనకమహాలక్ష్మి దేవస్థానంలో సెప్టెంబర్ 22 నుంచి అక్టోబర్ 2 వరకు శరన్నవరాత్రి మహోత్సవాలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా అమ్మవారు రోజుకో అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారు. మొదటి రోజు సెప్టెంబర్ 22న అమ్మవారు స్వర్ణకవచ అలంకరణలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఆ రోజు సువర్ణ పుష్పార్చన, సహస్రనామార్చన జరుగుతాయి. అక్టోబర్ 2న చివరి రోజున స్వర్ణకవచ అలంకరణ, 108 పుష్పాలతో స్వర్ణపుష్పార్చన నిర్వహిస్తారు.

**దుర్గాలమ్మ ఆలయం**


దుర్గాలమ్మ

దుర్గాలమ్మ శరన్నవరాత్రి మహోత్సవాలు సెప్టెంబర్ 22 నుంచి అక్టోబర్ 2 వరకు జరుగుతాయి. సెప్టెంబర్ 22న ఉదయం 8:30 గంటలకు స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ఉత్సవాలను ప్రారంభిస్తారు. భక్తులు భవానీ మాలలు ధరించి అమ్మవారిని దర్శించుకోవచ్చు. ప్రతిరోజు అమ్మవారు ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తారు. సెప్టెంబర్ 29న మూలా నక్షత్రం సందర్భంగా అమ్మవారు సరస్వతి దేవి అలంకరణలో కనిపిస్తారు.

**కన్యకాపరమేశ్వరి ఆలయం**


కన్యకాపరమేశ్వరి

పాతనగరం కురుపాం మార్కెట్ సమీపాన ఉన్న కన్యకాపరమేశ్వరి ఆలయంలో కూడా దేవీ శరన్నవరాత్రులు వైభవంగా నిర్వహిస్తారు. సెప్టెంబర్ 29న సరస్వతి దేవి అలంకరణలో దర్శనమిచ్చే రోజు 1500 మంది విద్యార్థులతో సరస్వతి పూజ నిర్వహిస్తారు. సెప్టెంబర్ 30న మహాలక్ష్మిగా అమ్మవారిని బంగారు నగలు, భారతీయ కరెన్సీ నోట్లతో అలంకరిస్తారు. చివరి రోజు అక్టోబర్ 2న విజయదుర్గా దేవిగా దర్శనమిస్తారు.ఈ మూడు ఆలయాలలోనూ ఉత్సవాల సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు, ఆరాధనలు నిర్వహిస్తారని ఆలయ నిర్వాహకులు తెలిపారు. భక్తుల సౌకర్యార్థం ప్రతిరోజు ఉదయం, సాయంత్రం వేళల్లో దర్శన సమయాలు కేటాయించారు.

## స్నాతకోత్సవం సమర్థంగా నిర్వహించాలి

మద్దిలపాలెం : ఆంధ్ర విశ్వవిద్యాలయ స్నాతకోత్సవాన్ని సమర్థంగా నిర్వహించాలని వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ సూచించారు. స్నాతకోత్సవ నిర్వహణపై వివిధ కమిటీల సభ్యులు, అధికారులతో శుక్రవారం ఆయన సమీక్ష నిర్వహించారు. అదేవిధంగా ఇప్పటి వరకు జరిగిన పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ రిసెప్షన్ కమిటీ, ఆర్గనైజింగ్ కమిటీ, సైటేషన్ కమిటీలకు కేటాయించిన బాధ్యతలు సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. స్నాతకోత్సవ మందిరానికి అవసరమైన మరమ్మతులు త్వరగా పూర్తి చేయాలని ఇంజినీరింగ్ విభాగానికి ఆదేశించారు. అందరూ సమన్వయంతో పని చేయాలని చెప్పారు. స్నాతకోత్సవంలో డిగ్రీలు తీసుకునే వారి సంఖ్య, అవార్డులు, మెడల్స్ వంటివి సిద్ధం చేయాలని ఆదేశించారు. నగదు బహుమతులను నేరుగా విద్యార్థుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసేలా ఏర్పాట్లు చేయాలన్నారు. సభా ప్రాంగణంలో విధులు నిర్వహించే సిబ్బందికి ఆన్ డ్యూటీ పాసులు మంజూరు చేయాలని సూచించారు. సబ్ కమిటీలతో సమన్వయం చేసుకుంటూ పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. సమావేశంలో రెక్టార్ ఆచార్య ఎన్.కిషోర్‌బాబు, రిజిస్ట్రార్ ఆచార్య కె.రాంబాబు, ప్రిన్సిపాళ్లు, డీన్‌లు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## సిరులతల్లికి క్షీరాభిషేకం


క్షీరాభిషేక సేవలో కనకమహాలక్ష్మి

దాబాగార్డెన్స్: బురుజుపేటలోని కనకమహాలక్ష్మి దేవస్థానంలో శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు జరిగిన ఈ పూజలో పలువురు భక్తులు పాల్గొన్నారు. ప్రతి శుక్రవారం ఈ ప్రత్యేక పూజ నిర్వహిస్తామని, పాల్గొనాలనుకునే భక్తులు రూ.500 చెల్లించి దంపతులు లేదా ఇద్దరు పాల్గొనవచ్చని ఆలయ కార్యనిర్వహణాధికారి కె. శోభారాణి తెలిపారు. వివరాల కోసం 0891-2566514, 2711725 నంబర్లలో సంప్రదించాలని ఆమె సూచించారు.

**నేడు తులసి పూజ**

శనివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు అమ్మవారికి తులసి పూజ నిర్వహించనున్నారు. ఈ పూజలో పాల్గొనాలనుకునే భక్తులు రూ.1,500 చెల్లించి పాల్గొనవచ్చు. పూజా రుసుంను యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్సీ కోడ్ యూబీఐఎన్ 0806091కి చెల్లించవచ్చు. ఆన్‌లైన్ ద్వారా చెల్లించినవారు ట్రాన్సాక్షన్ వివరాలు, పేరు, గోత్రనామాలు, చిరునామాను 8985515989 నంబరుకు వాట్సాప్ చేయాలని ఆలయ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కె. శోభారాణి, సహాయ కార్యనిర్వహణాధికారి కె. రాజేంద్రకుమార్ పాల్గొన్నారు.

## 2 వరకు వైద్య శిబిరాలు కొనసాగించాలి


మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట : స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి(డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వర రావు పలు పట్టణ ఆరోగ్య కేంద్రాలను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. బాపూజీనగర్ పట్టణ ఆరోగ్య కేంద్రం, స్వర్ణభారతి స్టేడియం సమీపంలోని పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వైద్యులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. అభ ఐడీ రిజిస్ట్రేషన్‌ను పరిశీలించి, స్పెషలిస్ట్ డాక్టర్ సేవలు, గర్భిణులకు అందిస్తున్న వైద్యం, క్యాన్సర్ పరీక్షలు, తదితర విషయాలపై అవగాహన కల్పించారు. ఈ వైద్య శిబిరాలు అక్టోబర్ 2వ తేదీ వరకు కొనసాగించాలని, మాతా శిశు సేవలు, గర్భిణులకు వైద్య సేవలు సాధ్యమైనంత వరకు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఆయనతోపాటు వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.